చలికాలంలో జరభద్రం

రామాయంపేటలో చలిమంట కాచుకుంటున్న యువకులు


మెదక్ మండలంలోని రోడ్డుపై దట్టంగా కురుస్తున్న మంచు

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

శీతాకాలంలో పాటించాల్సినవి..

మెదక్ రూరల్ నవంబర్ 25: చలి పంజా విసరడంతో పల్లెలు, పట్టణాలు గజగజా వణుకుతున్నాయి. గత పదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది నవంబర్‌లోనే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుదున్నాయి. రాత్రి వేళలో, తెల్లవారుజామున చల్లటి గాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రత ఎక్కువైంది. చలి పెరగడంతో రాత్రి వేళలో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. చలి తీవ్రతకు వ్యాధులు విజృంభించే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కార్తిక మాసం ప్రారంభంలోనే ఈ స్థాయిలో చలి ఉంటే రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనాలున్నాయి. చలికాలంలో శరీర వ్యవస్థలో మార్పులతో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకుంటూ, సలహాలు, సూచనలు పాటిస్తే, చలి నుంచి వచ్చే రోగాల భారీ నుంచి ఉపశమనం దొరుకుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పొగమంచు కారణంగా చలి ఎక్కువగా ఉంటుంది. లోపల స్వెటర్, పైన జర్కిన్ చేతులకు గ్లౌజులు ధరించాలి. చిన్నపిల్లలను బయట తిరగనివ్వకూడదు. ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగించకూడదు. వేడి పానీయాలు ఎక్కువగా తీసుకోవాలి. ఉన్ని దుస్తులు, మంకీ క్యాప్‌లు ధరించాలి. రాత్రి వేళలో ప్రయాణం తగ్గించుకోవాలి. గోరువెచ్చని నీరు, తేనె, నిమ్మరసం కలుపుకొని ఉదయాన్నే తాగాలి. నెల నుంచి ఏడాది లోపు చిన్నారులు జలుబు, జర్వం బారిన పడి శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. జలుబు చేసినా, జర్వం వచ్చినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అస్తమా, అలర్జీ, శ్వాసకోస, బ్లడ్‌ప్రెషర్ ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామంది గ్రామాల్లో చలి తీవ్రతకు చలిమంటలు పెట్టుకుంటారు. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి మంటలకు కళ్లు తిరిగి కింద పడిపోతారు. లోబీపీకి గురవుతారు. దుప్పట్లు కప్పుకుని చాలామంది మంటల వద్ద కుర్చుంటారు. అప్పుడప్పుడు మంటలు దుప్పట్లను అంటుకునే ప్రమాదాలు ఉంటాయి. చిన్నపిల్లలను మంటల వద్దకు రానివ్వకూడదు.

జాగ్రత్తలు పాటించాలి

చలికాలంలో ప్రతిఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. చలి అధికంగా ఉన్నప్పుడు చిన్నపిల్లలు, వృద్ధులు ఇండ్లలోనే ఉండాలి. చలికాలంలో జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు రావడానికి అవకావశం ఉంటుంది. ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

– చంద్రశేఖర్, ప్రభుత్వ దవాఖాన చిన్న పిల్లల వైద్యుడు, మెదక్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో వేగం పెంచాలి

- హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్

మెదక్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో వేగం పెంచాలని హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్ తెలిపారు. సోమవారం హవేళీఘనపూర్ మండలం లింగసాన్‌పల్లి గ్రామంలో, నర్సాపూర్‌లోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి హౌసింగ్ సెక్రటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో వేగం పెంచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద మెదక్ జిల్లాలోని హవేళీఘనపూర్ మండలం లింగ్‌సాన్‌పల్లి, నర్సాపూర్‌లోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. లింగ్‌సాన్‌పల్లి గ్రామం, నర్సాపూర్ మున్సిపాలిటీలో వార్డు నెంబర్ 5లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో వేగం పెంచాలన్నారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు తొలి దశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ పీఆర్ నర్సింలు, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, తహసీల్దార్ సింధూ రేణుక పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, కలెక్టర్ రాహుల్‌రాజ్

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు ఆకుల భిక్షపతి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

- అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, నవంబర్ 25: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ మహేందర్, సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. ఫిర్యాదులతో సమస్యలకు పరిష్కారాలు చేసుకోవాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 9 దరఖాస్తులు వచ్చాయన్నారు.

రెండేండ్లు గడిచిన సర్వే చేయరా?

నర్సాపూర్, నవంబర్ 25: భూమి సర్వే కోసం దరఖాస్తు చేసి రెండేండ్లు గడిచినా, ఇంకా సర్వే చేయరా అని కౌడిపల్లి మండలంలోని ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు భిక్షపతి ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ ముట్రాజ్‌పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 452లో పట్టా భూమిని సర్వే చేయాలని మే 6, 2022లో మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కౌడిపల్లి తహసీల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు సర్వే చేయాలని కోరినట్లు చెప్పా రు. దాదాపు రెండేండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏ అధికారి స్పందించడం లేదని, తన భూమిని సర్వే చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వే చేయించాలని కోరారు.


మెదక్ ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమాదేవి

వయ్యారిభామ అత్యంత ప్రమాదకరం

నర్సాపూర్, నవంబర్ 25: వయ్యారిభామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క అని, ఇది పంటలకే కాకుండా మనుషులు, జంతువులకూ హాని కలిగిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని ఖాజీపేట్ గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు తమ గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం తునికి ఆధ్వర్యంలో మూడు నెలలు ప్రాజెక్ట్ వర్క్ చేయడానికి వచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ శీతాకాలంలో వ్యయారిభామ మొక్కలను చాలా దూరంగా ఉంచాలని సూచించారు. వాటి పుప్పొడిని పీల్చడంతో అనేక అనారోగ్య, అస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఈ కలుపు మొక్కలతో 40 శాతం వరకు పంట దిగుబడి తగ్గుతుందన్నారు. దీని నివారణకు ఈ మొక్కలను పూత దశకు రాక ముందే పూర్తిగా నాశనం చేయాలన్నారు. 10 లీటర్ల నీటికి ఐదు కిలోల ఉప్పుతో కలిపి మొక్కలపై పిచికారీ చేస్తే కలుపు మొక్కలు నాశనమవుతాయన్నారు. వరి కొయ్యలు కాల్చడంతో నేలలో ఉష్ణోగ్రత పెరిగి మేలు జేసే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినులు ప్రసన్న, ప్రియాంక, సారిక, సాత్విక, సహరిక, మాధురి, శ్రీజ, హెచ్ఎం వసురాం, రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి అగ్రికల్చర్ విద్యార్థులు

జిల్లా స్థాయి క్రీడల్లో నార్సింగి విద్యార్థుల సత్తా

చేగుంట, నవంబర్ 25: జిల్లా స్థాయి క్రీడల్లో నార్సింగి విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలోని 21 వసతి గృహాల విద్యార్థులకు మెదక్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్, రన్నింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలోప్రథమ స్థానంలో నిలిచారు. కబడ్డీలో ద్వితీయ స్థానంలో నిలిచారని నార్సింగి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం మురళీమోహన్ సోమవారం తెలిపారు. ఉత్తమ శిక్షణ అందించిన పీడీ అశోక్‌కుమార్‌ను ఆయన అభినందించారు. పూర్ణచంద్రారావు, రామకృష్ణ, వెంకటేశం, ప్రసాద్, లలిత, స్వామి, కిషన్, పుష్పలత, మాధవి, సంతోష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి వివిధ క్రీడల్లో గెలుపొందిన నార్సింగి విద్యార్థులు

ఇందిరమ్మ ఇండ్లపైలట్ ప్రాజెక్ట్ పేరిట ప్రభుత్వం కాలయాపన: బీఆర్ఎస్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 25: ఇందిరమ్మ ఇండ్ల పైలట్ ప్రాజెక్ట్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలోని 1వ వార్డు, హవేళీఘనపూర్ మండలం లింగసానిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది కాని నేటి వరకు సర్వే ప్రారంభించిన దాఖలాలు లేవన్నారు. చిత్తశుద్ధి ఉంటే మండలానికి 5 గ్రామాలు, పట్టణానికి ఐదు వార్డులను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

అక్కన్నపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామాయంపేట రూరల్, నవంబర్ 25: అక్కన్నపేట జడ్పీహెచ్ఎస్ 2010-11 నాటి విద్యార్థుల సమ్మేళనం రామాయంపేటలోని శ్రీకర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం సిద్దిరాములు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

నిజాంపేట, నవంబర్ 25: మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన కృష్ణాగౌడ్ 3 నెలల క్రితం గుడ్ షెపర్డ్ పాఠశాలకు వెళ్తున్న క్రమంలో ఫోన్ పొగొట్టుకున్నాడు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఫోన్‌ను వెతికి ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బాధితుడి తమ్ముడు శివ గౌడ్‌కు సోమవారం అందజేశారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, నవంబర్ 25: సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. వారికి ఠాణాలో మూడు సెల్‌ఫోన్లు అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట రూరల్, నవంబర్ 25: కాట్రియాల గ్రామానికి చెందిన రాజయ్య ఇటీవలే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి రూ.2 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రామాయంపేట రూరల్, నవంబర్ 25: మండల కేంద్రంలోని మెదక్ రోడ్డు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడు యాచకుడిగా అనుమానించారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు.

కనుల విందుగా మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

నిజాంపేట, నవంబర్ 25: నిజాంపేటలో రైతులు, దాతల సహకారంతో నిర్మించుకున్న మైసమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం కనులపండువగా జరిగింది. పండితులు పంచాంగం వెంకటరమణ, శ్రీధరచార్యులు, శ్రీకాంత్ చార్యులు గణపతిపూజ, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. తాడెం మల్లేశం, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, తాడెం శ్రీశైలం, రాజు, శ్రీకాంత్, నాగరాజు ఉన్నారు.

కంటివైద్య శిబిరం విజయవంతం

రామాయంపేట, నవంబర్ 25: పట్టణంలోని కేసీఆర్ కాలనీలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. సోమవారం స్నేహబంధు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 150 మంది కాలనీవాసులకు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో వైద్యులు శ్రీనివాస్, సతీశ్, స్వర్ణలత పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి గురుకుల విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్, నవంబర్ 25: నర్సాపూలోని గురుకుల విద్యార్థులు 9వ తెలంగాణ సబ్ జూనియర్ సాఫ్టబాల్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. ఈ నెల 23, 24 తేదీల్లో మాసాయిపేట్‌లో నిర్వహించిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. దీంతో క్రీడాకారులు రాహుల్, శ్రీరాం, విజయ్, సంతోష్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

ఘనంగా సత్యసాయి బాబా వేడుకలు

రామాయంపేట, నవంబర్25: పట్టణంలోని సత్యసాయి బాబా 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం సత్యసాయి సేవా సదనంలో మంగళహారతులు, నైవేద్యాలు, పూజలు చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భక్తులు యాచం శంకరయ్య గుప్తా, గౌరీ శంకర్, బాలకిషన్ ఉన్నారు.

తూప్రాన్ పెద్ద చెరువులో చేపపిల్లల విడుదల

తూప్రాన్, నవంబర్ 25: తూప్రాన్ పెద్ద చెరువులో చేప పిల్లలను జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ గడప దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి హాజరయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మాట్లాడుతున్న ఎంఈవో పుష్పవేణి

చిన్నశంకరంపేట, నవంబర్ 25: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో పుష్పవేణి సూచించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. బడికి రాని పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు.

గృహప్రవేశానికి బీఆర్ఎస్ నాయకుడు హాజరు

చిన్నశంకరంపేట, నవంబర్ 25: అంబాజిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాబు సాగర్ గృహ ప్రవేశానికి పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి సోమవారం హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీనివాస్, బాలకిషన్, చంద్రాగౌడ్, మోహన్, దేవానందం, రాజు, పోచయ్య తదితరులు ఉన్నారు.

సఖి సేవలపై విద్యార్థులకు అవగాహన

గిరిజన కళాశాలలో మాట్లాడుతున్న సఖి నిర్వాహకురాలు రేణుక

మెదక్ మున్సిపాలిటీ/మెదక్‌రూరల్, నవంబర్ 25: మహిళలపై హింస నిర్మూలన అంతర్జాయ దినోత్సవాన్ని ఈ నెల 25 నుంచి డిసెంబర్10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సఖీ నిర్వాహకులు రేణుక, సంతోషి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో సఖీ సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హింసను అంతం చేయడంలో అందరూ ఏకం కావాలన్నారు. నేటి సమాజంలో బాలికలు లింగ అసమానుతలు ఎదుర్కొంటున్నారన్నారు. విద్య పోషణ, హింస, బాల్యవివాహాలు, లైంగిక, శారీరక వేధింపులకు గురవుతున్నారన్నారు. బాలికలు, మహిళలు తమ హక్కుల రక్షణకు ప్రభుత్వం చేసిన చట్టాలు తెలుసుకోవాలన్నారు. ఏదైన సమస్య ఎదురైతే 181, 1098, 100, 112 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. జెండర్ వివక్షత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫొక్సో యాక్ట్, టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ వాడటం ద్వారా నష్టాలు, ఫొటోలు షేర్ చేయడంతో జరిగే సైబర్ క్రైమ్ గురించి వివరించారు. సఖీ సేవల పోస్టర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు

చిన్నశంకరంపేట, నవంబర్ 25: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అక్బర్ బహూకరించిన 24 కొబ్బరి మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం యాదగిరి, గ్రామస్తులు ప్రభాకర్, యాదగిరి, పాండు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరుత సంచారం ఘటనపై విచారణ

గుండ్రెడ్డిపల్లి అడవిలో చిరుత సంచారంపై విచారణ చేపడుతున్న ఫారెస్ట్ అధికారులు

తూప్రాన్, నవంబర్ 25: మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో చిరుత సంచారం కలకలం రేపింది. మూడు, నాలుగు రోజులుగా గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. చిరుత సంచారానికి సంబంధించి ఓ వ్యక్తి వీడియో తీయడంతో వైరల్‌గా మారింది. పశువుల కాపరులు అడవిలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఓం ప్రకాశ్, చిరంజీవి, బీట్ ఆఫీసర్ పద్మ చిరుత సంచారాన్ని నిర్ధారించేందుకు ప్రయత్నించారు. అయినా చిరుత జాడ కనబడలేదు. ఈ సందర్భంగా ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని, గుంపులుగా వెళ్లాలని వారు సూచించారు. చిరుత జాడ కనబడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు గ్రామస్తులకు సూచించారు.

చేగుంటకు చేరిన మాలల మహా పాదయాత్ర

చేగుంటలో పాదయాత్రగా వెళ్తున్న మాలల మహానాడు నాయకులు

చేగుంట, నవంబర్ 25: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, దళితుల ఐక్యత కోసం చేపట్టిన మాలల మహా పాదయాత్ర సోమవారం చేగుంటకు చేరుకున్నది. జాతీయ మాల మహానాడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఈ పాదయాత్రను చేపట్టారు. చేగుంటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకల శ్రీరాములు, మెదక్ జిల్లా అధ్యక్షుడు సంజీవులు, ఇన్‌చార్జి ఉగ్గాడి శేఖర్, చేగుంట అధ్యక్షుడు సిరిగోని నర్సింహులు, నార్సింగి, చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు బాబు, సంజీవ్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, నవంబర్ 25: మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం సోమవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో పాటు రాజీవ్ రహదారిపై పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మంది మందుబాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సిద్దిపేట స్పెషల్ సెంకడ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరు పరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి వాహనదారులకు రూ.12 వేల జరిమానా విధించారు